క్లుప్తంగా

నేడు, రేపు వారాహి అమ్మవారి పూజలు

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన వద్ద వేంచేసిన విజయదుర్గ ఆలయం, అయ్యప్పస్వామి ఆలయాల ప్రాంగణంలో శుక్ర, శనివారాల్లో వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రముఖ వేదపండితుడు వెలువలి వెంకటశివ రామ్ (శివాజీ), ఖండవల్లి పాండురంగాచార్యులు తెలిపారు. కార్తిక బహుళ సప్తమి శుక్రవారం ఉదయం స్మార్త పురోహితుల ఆధ్వర్యంలో వారాహి అమ్మవారి విగ్రహం, లక్ష రుద్రాక్షల ఊరేగింపు, మధ్యాహ్నం సామూహిక లక్ష రుద్రాక్షల పూజ, సహస్ర కుంకుమార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శనివారం వారాహి అమ్మవారికి లక్ష పుష్పార్చన, లక్ష గాజులతో అర్చన, కుంకుమార్చన, చండీహోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు, అనంతరం అయ్యప్ప గురుస్వాములకు సన్మానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పూజల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఆదిపరాశక్తి అమ్మవారి సర్వసైన్యాధికారిగా వెలుగొందుతున్న వారాహీ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలనే ఉద్దేశంతో వారాహీ అమ్మవారిని మాచవరం శివాలయం ప్రాంగణంలో ప్రతిష్ఠించినట్లు ఆలయ అర్చకుడు మాచరి సూర్యనారాయణ చెప్పారు. గ్రామానికి చెందిన జోగి కృష్ణ చైతన్య, వినోదిని దంపతులతో పాటు గుత్తుల సురేష్ కుమార్, లలితా దంపతులు లక్ష్మీవారాహీ అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు అర్చకుడు చెప్పారు. అమ్మవారి విగ్రహాన్ని సుమారు రూ.లక్షతో ప్రతిష్ఠించినట్లు అర్చకులు తెలిపారు. ఈ విగ్రహాన్ని తెలంగాణలోని కరీంనగర్ నుంచి తీసుకొచ్చినట్లు చైతన్య పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రావులపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని నేరుగా పరిష్కరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11.30 గంటల నుండి 12.30 గంటల వరకు 9959225537 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని ఆయన అన్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలా దేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు. ఎనీమియా నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందించనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల తనిఖీ



మోరిలో పదో తరగతి విద్యార్థులతో మమేకమైన డీఈవో

సఖినేటిపల్లి: మండలంలోని మోరి, రామేశ్వరం, ఉయ్యూరువారి మెరక జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం డీఈవో షేక్ సలీం బాషా ఆకస్మిక తనిఖీ చేశారు. మోరి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఎలా సంసిద్ధులవుతున్నారన్న దానిపై విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు, టీచర్లకు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడం కోసం పలు సూచనలు ఆయన చేశారు. అలాగే రామేశ్వరం, ఉయ్యూరువారి మెరక ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఈవెనింగ్ తరగతులను ఆయన పరిశీలించారు. జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈవో-1, 2 డీ కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్.శ్రీధర్ కృష్ణ, డి.జగదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొత్తపేట: మందపల్లి ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లను సీజ్ చేసి, తొలి హెచ్చరికగా రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. స్థానిక ఎస్సై పాత బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లను ఆపి రికార్డులు, సచివాలయం రశీదులు తనిఖీ చేసి, అవి సక్రమంగా లేకపోవడంతో బుధవారం ఒక ట్రాక్టరు, గురువారం ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి, తహసీల్దార్‌కు నివేదించారు. దీనిపై తహసీల్దార్ వై.రాంబాబును వివరణ కోరగా ఒక సచివాలయం నుంచి 19న పొందిన రశీదుతో, ఒకే రశీదు జెరాక్స్‌తో ఇసుక తరలించడం వంటి కారణాలతో సీజ్ చేసినట్టు తెలిపారు. దానిపై తొలి హెచ్చరికగా పరిగణించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2 వేలు చొప్పున జరిమానా వేసినట్టు తెలిపారు. అలా 5 ట్రాక్టర్లు రిలీజ్ చేయగా, మరో ట్రాక్టరుకు సంబంధించి జరిమానా కట్టని కారణంగా ఆ ట్రాక్టరు విడుదల చేయలేదని తహసీల్దార్ తెలిపారు.

పశుగణన.. లెక్క పక్కా..

- ముమ్మరంగా జంతువుల లెక్కింపు
- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ



అంబాజీపేటలో ఇంటింటికీ వెళ్లి పశుగణన చేస్తున్న సిబ్బంది (ఫైల్)

అంబాజీపేట: గ్రామాల్లో పక్కాగా పశుగణన ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ కార్యక్రమం 2019లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో పశుగణనను నిర్వహిస్తుంది. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు వంటి మూగజీవాల్లో లెక్కింపు ముమ్మరంగా సాగుతుంది. నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ తిరిగి పక్కాగా లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పశుగణన 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకూ జరుగుతుందని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రతి రోజూ 20 నుంచి 30 ఇళ్లు తిరిగి సర్వే చేస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో సర్వే ఇలా...

పశుగణన సర్వే పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి, పి.గన్నవరం మండలాల్లో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మొత్తం ఈ నాలుగు మండలాల పరిధిలో 40 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు మండలాల్లోను సుమారు 50వేల ఇళ్లలో 20 శాతం పశువులను సర్వే చేశారు. మిగిలిన ఇళ్లలో కూడా ఫిబ్రవరి నాటికి పశుగణన పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

16 రకాల పశువుల లెక్కింపు

గ్రామాల్లో ఫిబ్రవరి వరకూ జరగనున్న పశుగణనలో 16 రకాల జంతువుల లెక్కింపు చేస్తారు. వీటిలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులతో పాటు ఇతర కొన్ని జంతువులు కలిపి 16 రకాలు ఉన్నాయి. ఈ విషయమై పశుగణన సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో మాదిరిగా కాకుండా గణన చేసే ప్రాంతాల్లోనే ఇంటింటికీ వెళ్లి పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అప్‌లోడ్ చేసిన వివరాలను సూపర్‌వైజర్లు పరిశీలిస్తున్నారు. ఈ సర్వేను మండల, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించి పశుగణన పక్కాగా జరిగేలా సిబ్బందికి పలు సూచనలు ఇస్తున్నారు.

ఎంతో ఉపయోగం



పశుగణన వల్ల ఎంతో ఉపయోగం ఉంది. పథకాల అమలుకు ఇది అవసరం. పశువులకు ఆహార భద్రత కల్పించడంలోనూ, సంక్రమణ వ్యాధులను నివారించడానికి జీవనోపాధి కల్పించడంలోనూ పశుగణన ఎంతో ఉపయోగపడుతుంది. పశుగణన పక్కాగా జరగాలంటే ప్రజలు సహకరించాలి.

– డి.రాజేంద్రప్రసాద్, మండల పశువైద్యాధికారి, అంబాజీపేట

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



పి.గన్నవరం సీహెచ్‌సీలో పేషెంట్లకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పి.గన్నవరం: ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు ఆధ్వర్యంలో గురువారం పి.గన్నవరం సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. స్థానిక అక్విడెక్ట్ పార్కులో అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర సంఘ నాయకుడు దివంగత పెమ్మాడి సుబ్బరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సంఘ నాయకులు పెమ్మాడి మారుతీ కృష్ణమోహన్, కొల్లు రాంబాబు, అరదాని ఏడుకొండలు, మల్లాడి గోపి, లంకే కృష్ణారావు, కొల్లాటి వెంకట్రావు, పొన్నమండ రాముడు, ఎం.కళ్యాణరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



లూటుకుర్రులో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తికమాసం గురువారం లూటుకుర్రులోని పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కన్నుల పండువలా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు, పార్వతీదేవికి లక్ష బిల్వార్చన పూజలను ఘనంగా జరిపించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూజ అనంతరం సోమేశ్వరస్వామి వారికి పలు రకాల పుష్పాలు, పండ్లతో విశేషంగా అలంకరణ చేశారు. గ్రామ సర్పంచ్ అడబాల తాతకాపుతో పాటు పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చనలో కర్తలుగా పాల్గొన్నారు. పెదపట్నం లంక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ముత్యాల పాలానికి చెందిన రేకపల్లి అమ్మాజీ, పెదపట్నంలంకకు చెందిన సలాది శ్రీనివాసరావు, దొరబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

మాచవరంలో..

అంబాజీపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మాచవరంలో పార్వతీ సమేత రాజేశ్వర స్వామికి, కందుల మల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వర స్వామికి, గంగలకుర్రు అగ్రహారం ఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీ, భూ సమేత కేశవస్వామి వార్లకు లక్ష బిల్వార్చన, ప్రత్యేకాభిషేకాలను గురువారం నిర్వహించారు. కె.పెదపూడి, గంగలకుర్రు, నందంపూడి, ఇరుసుమండ తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు



ఇరుసుమండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ భీమరాజు

అంబాజీపేట: ఆధునిక ప్రపంచంలో అరచేతిలో ఇమిడిపోయే సాధనాల వినియోగం వల్ల సైబర్ నేరగాళ్లు చాలా సులువుగా ప్రజలను మోసం చేస్తున్నారని, వారి వలలో పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైబర్ నేరాల నివారణ, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై కె.చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. సీఐ భీమరాజు మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగం అవసరం మేరకు ఉపయోగించుకోవాలని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను, మెసేజ్‌లను ఓపెన్ చేస్తే వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లు తస్కరించి ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరిస్తున్నారన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై ఎస్సై మాట్లాడారు. ఆపదలో చిక్కుకున్నప్పుడు డయల్ 112కు సమాచారాన్ని అందిస్తే పది నిమిషాల వ్యవధిలో పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్స్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేశవదాసు విగ్రహం పెట్టడంతో కృష్ణమ్మకు ప్రాధాన్యం తగ్గదు

మలికిపురం: అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వామి సాక్షాత్కారం పొందిన మందపాటి కేశవదాసు విగ్రహం ఆలయ ప్రాంగణంలో పెట్టడం వల్ల ఆలయ పునర్నిర్మించిన కొపనాతి కృష్ణమ్మకు ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గదని రాజోలు తాలూకా శ్రీకృష్ణ యాదవ సంఘ కార్యవర్గం తెలిపింది. గురువారం మలికిపురంలో ఈ మేరకు కార్యవర్గ అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.వెంకట రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, కన్వీనర్ నూనె రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. కలియుగంలో స్వామివారి సాక్షాత్కారం పొందిన భక్తుడు కేశవదాసు అని, కర్రలతో ఆలయం నిర్మించి, పూజలు చేశారని స్థల పురాణాలు చెబుతున్నాయన్నారు. అలాగే శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మించిన భక్తుడు కొపనాతి కృష్ణమ్మ అని అన్నారు. కాగా అగ్నికుల క్షత్రియులకు తాము వ్యతిరేకం కాదని, వారి సహాయ సహకారాలతో త్వరలో కేశవదాసు విగ్రహం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి



మామిడికుదురులో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న జీఎం నారాయణ

మామిడికుదురు: గెయిల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని జనరల్ మేనేజర్ కేబీ నారాయణ తెలిపారు. మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో ఉచిత శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. కోనసీమ జిల్లాలోని మామిడికుదురులో గెయిల్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అత్యున్నత శిక్షణ ఇచ్చి వారికి వివిధ కార్పొరేట్, ఇండస్ట్రియల్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో రెండు నెలలు, డ్రాఫ్ట్‌మెన్, మెకానికల్ కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కిట్లు, బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ (హెచ్‌ఆర్) ప్రభాకర్, మేనేజర్ వైవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పునరుద్ధరణ



చొప్పెల్లలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించి పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. చొప్పెల్ల, నవాబుపేట, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో పర్యటించిన ఆయన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు, సంబంధిత పంచాయతీ పాలకవర్గ సభ్యులతో మాట్లాడి పునరుద్ధరణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. అనంతరం చెముడులంకలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పనులను పరిశీలించారు. మండలంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అసంపూర్ణ నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులకు హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎం.విజయారెడ్డి, జె.అయ్యన్న, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి



కార్తిక వనసమారాధనలో ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న జోగినాయుడు, రామం దంపతులు

కొత్తపేట: కార్తిక వన సమారాధనలు వంటి తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ సినీ ఆర్టిస్టు, రాష్ట్ర కల్చరల్ కమిషన్ మాజీ చైర్మన్ జోగినాయుడు అన్నారు. కొత్తపేటకు చెందిన ప్రముఖ వేద పండితుడు పెద్దింటి రమచంద్రశ్రీహరి (రామం) దంపతుల ఆధ్వర్యంలో కొత్తపేటకు సమీపాన కపిలేశ్వరపురం మండలం వీదివారిలంకలో ధనమ్మ మర్రి వద్ద కుల, మతాలకు అతీతంగా స్నేహితులు, సన్నిహితుల కుటుంబాలతో గురువారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో రావులపాలేనికి చెందిన ప్రముఖ వైద్యుడు కొవ్వూరి వీర్రెడ్డి, సినీ ఆర్టిస్టు జోగినాయుడు సతీసమేతంగా పాల్గొన్నారు. జోగినాయుడు మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు ఉద్యోగ, ఉపాధి పేరిట వేరు వేరు చోట్ల గడుపుతున్నారన్నారు. అందరితో కలసి ఉసిరిచెట్టు పూజ, వన సమారాధన మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. అవకాశం ఉన్నంత వరకూ ఏటా వస్తామని అన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,116 విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న దాతలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం పి.గన్నవరానికి చెందిన గుబ్బల వీరంశెట్టి, విశ్వనాథం కృష్ణమూర్తి, భాస్కరరావులు కలిపి రూ.50,116 విరాళం అందజేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్‌కు ఇచ్చి, స్వామివారి చిత్రపటాన్ని వారు అందుకున్నారు.

స్వామిని దర్శించుకున్న రామరాజ్ జీయర్ స్వామి

అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహస్వామివారిని కర్ణాటకలోని మేల్కోటి క్షేత్రాధిపతి శ్రీత్రిదండి శఠగోప ముని రామరాజ్ జీయర్ స్వామి దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆలయ మర్యాదలతో అర్చకులు సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, స్వామిజీకి స్వామి చిత్రపటం అందజేశారు.

స్వామివారి సన్నిధిలో డీసీ రమేష్‌బాబు

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం కాకినాడ ఎండోమెంట్స్ డీసీ డీవీవీ రమేష్ బాబు, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు టెండర్ కం బహిరంగ వేలం

అంతర్వేది దేవస్థానంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని వివిధ పనులకై శుక్రవారం ఆలయ వద్ద టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీజ్ చేసిన ఆరు బైక్‌లకు రేపు వేలం

పి.గన్నవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో సీజ్ చేసిన ఆరు మోటారుసైకిళ్లను ఈనెల 23న పి.గన్నవరం తహసీల్దార్ సమక్షంలో వేలం వేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని ఆయన వివరించారు.

పలు ఇసుక ర్యాంపుల పరిశీలన



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

రావులపాలెం: మండలంలోని ఊబలంక ఇసుక ర్యాంపును గురువారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. త్వరలో ప్రారంభం కానున్న ఉచిత ఇసుక పంపిణీలో ఇసుక ర్యాంపు నిర్వహణ, నిబంధనల అమలు తదితర అంశాలపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరలో బుకింగ్ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి ఇసుకను అందిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఆర్ఐ సుజాత తదితరులు ఉన్నారు.

ఇసుక రీచ్‌ల్లో నిబంధనలు పాటించాలి

ఆత్రేయపురం: ఇసుక రీచ్‌ల తవ్వకాల్లో నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఆత్రేయపురం, పులిదిండి, నార్కెడ్‌మిల్లి ఇసుక రీచ్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా గ్రామాల వద్ద ఇసుక రీచ్‌లో పలు సమస్యలను ఆయన వద్ద ఏకరవు పెట్టారు. ఆయా రీచ్‌ల వద్ద సిబ్బందికి, కాంట్రాక్టర్లకు పలు సూచనలిచ్చారు. రీచ్‌ల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ బీఎస్ఎన్ వెంకట్‌రామన్, ఎస్సై ఎస్.రాము, డీటీ శ్రీరామచంద్రమూర్తి, ఆర్ఐ ఎం.భాను, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లం‘ఘనులు’



పీర్మాయిపాలెం వద్ద పవన్ ఫ్లెక్సీ

అంబాజీపేట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు కావడం లేదు. ప్రధాన కూడళ్లలో దర్శనమిస్తున్న టీడీపీ, జనసేన ఫ్లెక్సీలే ఇందుకు నిదర్శనం. అధికారుల కళ్ల ముందే కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. అంబాజీపేట శివారు పీర్మాయిపాలెం మలుపు వద్ద, మాచవరం, ముక్కామల గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంబడి పలు పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అధికారులు వాటి ముందు నుంచే తిరుగుతున్నా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీన్ని బట్టి ఎన్నికల నియమావళిపై అధికారులకు ఏ మాత్రం గౌరవం ఉందో అర్థమవుతుంది. ఈ విషయంపై కొందరు స్థానికులు పంచాయతీ అధికారులను నిలదీసినప్పటికీ ఫలితం లేకపోయింది.

ఉన్ని దుస్తుల సందడి షురూ



అంబాజీపేటలో రోడ్డు పక్కన విక్రయిస్తున్న ఉన్ని దుస్తులు

అంబాజీపేట: ప్రస్తుతం వర్షాలు తగ్గి చలి తీవ్రత పెరుగుతుంది. శీతాకాలంలో ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరుగుతుంది. చలి నుంచి ఉపశమనం పొందడానికి ఈ వస్త్రాలు బాగా ఉపకరిస్తాయి. ఏటా ఉత్తరప్రదేశ్ నుంచి పలువురు చిరు వ్యాపారులు అంబాజీపేట, పి.గన్నవరం, కొత్తపేట, రావులపాలెం తదితర ప్రాంతాలకు వచ్చి నవంబరు, డిసెంబర్, జనవరి నెలల్లో ఉన్ని వస్త్రాలను విక్రయిస్తారు. మండలాల్లోని ముఖ్య కూడళ్లలో ఈ ఉన్ని వస్త్రాల దుకాణాలను ఏర్పాటు చేసి వాటిని విక్రయించి ఉపాధి పొందుతారు. ఉత్తరప్రదేశ్‌లో తయారైన ఉన్ని వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంటుంది. అప్పుడే పుట్టిన చంటి బిడ్డకి సరిపడా ఉన్ని వస్త్రం నుంచి అన్ని వయస్సుల వారికి, స్త్రీలు, పురుషులు అందరికీ సరిపడా ఉన్ని వస్త్రాలు వీరి దగ్గర లభిస్తాయి. అలాగే వర్షాకాలంలో ఉపయోగించే రెయిన్‌కోట్లను కూడా వీరు విక్రయిస్తున్నారు. శీతాకాలంలో మంచులో తిరిగితే జలుబు, ఇతర రుగ్మతలకు గురవుతారు. మంచు నుంచి ఉపశమనం పొందడానికి తల, చెవులు, ముక్కును కప్పుతూ టోపీలు, రగ్గులు, స్వెట్టర్లు విక్రయిస్తున్నారు. గతంలో పది నుంచి 15 మంది వరకు వచ్చి ముఖ్య మండలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేవారు. అయితే ఈ ఏడాది నలుగురు వ్యాపారులు మాత్రమే వచ్చారు. మరో నాలుగు రోజుల తరువాత మరి కొంత మంది వ్యాపారులు వస్తారని ఉత్తరప్రదేశ్‌కి చెందిన పరభూత్ సింగ్ చెబుతున్నారు.

పి.గన్నవరంలో ఓపెన్ హౌస్



పి.గన్నవరం స్టేషన్‌లో లాకప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకృష్ణ

పి.గన్నవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నరేంద్రపురం ఆక్స్‌ఫర్డ్ స్కూలు విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ విభాగాలపై విద్యార్థులకు ఎస్సై బి.శివకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ స్కూలు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.